


EVENING EDITION

నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com

4PM
www.suryaa.com
సోమవారం
21 అక్టోబర్ 2024
పేజీలు: 02




# రేషన్ కార్డులపై శుభవార్త?

ఒక కుటుంబానికి రేషన్ కార్డుంది.. రేషన్ మాత్రం భార్యాభర్తలకే వస్తోంది..వారి ఇద్దరు పిల్లలకు రావట్లేదు. మరో కుటుంబంలో మెట్టినింట రేషన్‌కార్డులో కోడలి పేరు చేరలేదు. అలాగని పుట్టినింట కార్డులోనూ లేదు. పెళ్లయి అత్తారింటికి వెళ్లాక ఆమె పేరును పుట్టింటి కార్డులోంచి తొలగించారు... సంవత్సరాలుగా ఉన్న ఈ సమస్యకు త్వరలో పరిష్కారం లభించనున్నట్లు పౌరసరఫరాలశాఖ వర్గాల సమాచారం. రేషన్‌కార్డుల్లో అర్హులైన కొత్త కుటుంబ సభ్యుల పేర్లను చేర్చేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని తెలిసింది. "ఫ్యామిలీ డిజిటల్ కార్డుల అంశం కొలిక్కి రాగానే ఈ విషయంపై కీలక నిర్ణయం ఉంటుంది. ఇప్పటికే ఉన్న రేషన్ కార్డుల్లో అర్హులైన కుటుంబ సభ్యుల పేర్లను చేర్చే ప్రక్రియ మొదలవుతుంది. ఆ తర్వాత నూతన రేషన్ కార్డులకు దరఖాస్తుల స్వీకరణ ఉంటుంది' అని ఉన్నతాధికారి ఒకరు చెప్పారు.

రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో 11.08 లక్షల దరఖాస్తులు...

రేషన్ కార్డుల్లో అర్హుల పేర్లను చేర్చాలని రాష్ట్రంలో లక్షల కుటుంబాలు మీసేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకున్నాయి. ప్రభుత్వ అనుమతి లేకపోవడంతో పౌరసరఫరాల శాఖ ఇన్నాళ్లూ వాటిని పరిశీలించలేదు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 11.08 లక్షల దరఖాస్తులు అందాయి. వాటిని ఆమోదిస్తే ప్రభుత్వంపై ఎంత భారం పడుతుందన్న విషయంపై అధికారులు నివేదిక ఇచ్చారు. నెలకు సుమారు 9,890 టన్నుల బియ్యం అదనంగా కావాల్సి ఉంటుందని.. రూ.37.40 కోట్ల భారం పడుతుందని పౌరసరఫరాల శాఖ అధికారులు అంచనా వేసినట్లు తెలిసింది. తొలుత ఫ్యామిలీ డిజిటల్ కార్డులు వచ్చాక.. ప్రస్తుత రేషన్ కార్డులు, అందులోని లబ్ధిదారుల సమాచారం అంతా అందులో చేరిపోయేలా సాఫ్ట్‌వేర్‌ను రూపొందించనున్నట్లు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డుతో రేషన్ దుకాణానికి వెళ్లి అక్కడ క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే చాలు..ఆ కుటుంబానికి ఏ సరకులకు, ఎంత పరిమాణానికి అర్హత ఉంది అన్న వివరాలు తెలిసిపోతాయి. ఆ మేరకు రేషన్ ఇస్తారు. తర్వాత అర్హత కలిగిన కుటుంబ సభ్యులను చేర్చే దరఖాస్తుల్ని పరిశీలించి ఆమోదిస్తే.. వారి సమాచారం కూడా ఫ్యామిలీ డిజిటల్ కార్డుల్లో చేరిపోతుందని పౌరసరఫరాల శాఖ వర్గాలు తెలిపాయి.



## లాభాల్లో ప్రారంభమైన స్టాక్ మార్కెట్లు

భారతీయ బెంచ్‌మార్క్ సూచీలు బీఎస్ఈ సెన్సెక్స్, నిఫ్టీ 50 సోమవారం అధిక స్థాయిలో ప్రారంభమయ్యాయి. ప్రారంభ సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 420 పాయింట్లు లేదా 0.52 శాతం పెరిగి 81,645 వద్ద, నిఫ్టీ 50 108 పాయింట్లు లేదా 0.44 శాతం పెరిగి 24,962 వద్ద పయనిస్తున్నాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టెక్ మహీంద్రా, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, ఏషియన్ పెయింట్స్, విప్రో టాప్ గెయినర్స్‌గా లాభాల్లో కొనసాగుతున్నాయి. మరోవైపు టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ , కొటక్ మహీంద్రా, బీపీసీఎల్, భారతీ ఎయిర్‌టెల్, ఇండస్‌ఇండ్ బ్యాంక్ టాప్ లూజర్స్‌గా భారీ నష్టాల్లో చలిస్తున్నాయి. కాగా సోమవారం ఉదయం చైనా సెంట్రల్ బ్యాంక్ ప్రకటించిన రేటు తగ్గింపును ట్రేడర్లు అంచనా వేయడంతో ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో మార్కెట్లు స్వల్పంగా పెరిగాయి. పీపుల్స్ బ్యాంక్ ఆఫ్ చైనా ఒక సంవత్సరం రుణ ప్రైమ్ రేటుని 25 బేసిస్ పాయింట్లు తగ్గించి 3.1 శాతానికి తగ్గిస్తున్నట్లు తెలిపింది. అయితే ఐదేళ్ల ఎల్‌పీఆర్ 3.6 శాతానికి తగ్గింది.




## నారాయణ కాలేజీలో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

నగరంలోని నారాయణ కాలేజీలో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన తీవ్ర కలకలం సృష్టించింది. ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థిని అనూష కాలేజీలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వివరాల ప్రకారం.. బాచుపల్లిలోని నారాయణ కాలేజీలో ఇంటర్ విద్యార్థిని అనూష హాస్టల్ గదిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అనూష ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతోంది. ఈ నేపథ్యంలో కాలేజీ యాజమాన్యం తొలుత విద్యార్థి పేరెంట్స్‌కు స్పృహ తప్పి కిందపడిపోయినట్టు సమాచారం ఇచ్చారు. దీంతో, పేరెంట్స్ కాలేజీకి బయలుదేరారు. వారు. కాలేజీకి వెళ్లే సరికి అనూష ఉరి వేసుకొని చనిపోయిందని యాజమాన్యం తెలిపింది యాజమాన్యం. పేరెంట్స్ కాలేజీకి రాకముందే అనూష మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించింది నారాయణ కాలేజీ యాజమాన్యం. ఇక, ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు.



## ట్రంప్.. మీరు ఫిట్‌గా ఉన్నారా?: కమలా హారిస్

అత్యంత కష్టమైన అమెరికా అధ్యక్ష పదవిలో పనిచేసేంత ఫిట్‌గా ట్రంప్ ఉన్నారా అంటూ కమలా హారిస్ తాజాగా ప్రశ్నించారు. అలసిపోవడం వల్ల పలు ఇంటర్వ్యూలను ట్రంప్ రద్దు చేసుకుంటున్నారన్న వార్తల నేపథ్యంలో ఆమె స్పందించారు. 'ప్రచారంలోనే అలసిపోయే మీరు అధ్యక్ష పదవికి అర్హులేనా అన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి' అని విమర్శించారు. మరోవైపు.. కమలకు కనీసం కుందేలుకున్న ఎనర్జీ కూడా లేదంటూ ట్రంప్ ఎద్దేవా చేశారు.



## కోటి మంది యూజర్లు జియోకి గుడ్ బై!

రీఛార్జ్ ప్లాన్స్ ధరలు పెంచిన తర్వాత రిలయన్స్ జియోకు యూజర్లు షాక్ ఇచ్చారు. రెండవ త్రైమాసికంలో 1.07కోట్ల మంది జియోకు గుడ్ బై చెప్పినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అయితే 5G సబ్‌స్క్రైబర్స్ బేస్ మాత్రం 17మిలియన్లు పెరిగి 147 మిలియన్లకు చేరింది. ఒక్కో యూజర్ నుంచి వచ్చే సగటు ఆదాయం రూ.181.7 నుంచి రూ.195.1కి పెరిగింది. వినియోగదారుల్ని కోల్పోవడం తమ లాభాలపై పెద్దగా ప్రభావం చూపదని కంపెనీ పేర్కొంది.



## నేడు కోర్టుకు నందిగం సురేశ్

వైసీపీ నేత నందిగం సురేశ్‌ను ఈరోజు పోలీసులు కోర్టులో హాజరుపర్చనున్నారు. 2020లో జరిగిన ఘర్షణల విషయంలో ఆయన ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఉదయం 10గంటలకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఆ తర్వాత మంగళగిరి కోర్టులో హాజరుపరుస్తారు. రెండు రోజుల పోలీసుల కస్టడీ ముగియడంతో ఆయనను కోర్టుకు తీసుకొస్తున్నారు. కాగా విచారణలో తేలిన అంశాల ఆధారంగా త్వరలోనే ఛార్జ్‌షీట్ దాఖలు చేసే అవకాశం ఉంది.



## బాంబు బెదిరింపు కాల్స్: రూల్స్ మారుస్తున్న కేంద్రం

బెదిరింపు కాల్స్‌తో విమానాలకు అంతరాయాలు కలగకుండా కేంద్రం రూల్స్ మారుస్తోంది. ప్యాసింజర్, కార్గో సహా సెకండరీ లాడార్ పాయింట్ల వద్ద హ్యాండ్ బ్యాగుల చెకింగ్ ముమ్మరం చేయనుంది. మెసేజులు పెడుతున్న వారిని పట్టుకొనేందుకు VPN ప్రొవైడర్లతో కలిసి పనిచేయనుంది. SMలో ఒకే అకౌంట్ నుంచి ఎక్కువ మెసేజెస్ పెట్టి గంటల్లోనే డిలీట్ చేయడాన్ని గమనించిన సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ సైబర్ టీమ్స్‌ను అలర్ట్ చేసింది.



## బాలసదన్‌లో దారుణం

### పదేళ్ల అనాథ బాలికపై లైంగిక దాడి

భువనగిరి - అనాథ బాలికలకు ఆశ్రయం కల్పించాల్సిన బాలసదన్ లోనే పదేళ్ల అనాథ బాలికపై లైంగిక దాడి. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన. ఈ నెల 14న ఒక కార్యక్రమం నిర్వహణ పేరుతో డీసీపీఓతో పాటు మరి కొంతమంది వ్యక్తులు రాత్రి 7 గంటల సమయంలో భువనగిరి బాలసదన్‌కు వచ్చారు. కార్యక్రమం జరుగుతున్న సమయంలో ఓ బాలిక బాత్రూంకు వెళ్లి వస్తున్న సమయంలో.. ఓ వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం బాలిక ఏడ్చుకుంటూ తన గదిలోకి వెళ్లిపోయింది. గమనించిన బాలసదన్ సిబ్బంది ఆరా తీయగా ఓ వ్యక్తి తనపై లైంగిక దాడి చేశాడంటూ తన శరీరంపై గాయాలను చూపించింది. వెంటనే సిబ్బంది డీసీపీఓకు సమాచారం అందించారు. డీసీపీఓ సంబంధిత వ్యక్తిపై పోలీస్ స్టేషన్లో కేసు పెట్టకపోగా విషయాన్ని ఎవరికీ చెప్పవద్దని, చెబితే అందరి ఉద్యోగాలు పోతాయని ఉద్యోగులను బెదిరించినట్లు తెలిసింది. అదీగాక బాలికను వలిగొండలోని ప్రైవేట్ అనాథాశ్రమానికి తరలించి నట్లు సమాచారం. కాగా ఆదివారం బాధితురాలు ఉన్న వలిగొండ శాంతి నిలయంలో డీసీపీఓ సైదులు, కౌన్సిలర్ వెళ్లి విచారణ జరపగా బాధితురాలు తనపై లైంగిక దాడి జరిగిన విషయాన్ని చెప్పినట్లు సమాచారం. కలెక్టర్ స్పందించి బాలికపై లైంగిక దాడి చేసిన డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్‌కు చెందిన అటెండర్‌ను అదుపులోకి తీసుకోవాలని బాలల హక్కుల సంఘం సామాజికవేత్తలు కోరారు. దాడి ఘటనను దాచి పెట్టిన బాలల సంరక్షణ అధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



## ఫుల్ జోష్‌లో ప్రగ్యా జైస్వాల్

ప్రగ్యా జైస్వాల్ ఫుల్ జోష్‌లో ఉంది. వరుసగా బాలయ్య సినిమాల్లోనే ఆఫర్స్‌ను సొంతం చేసుకుంది. అఖండ 2, NBK109 మూవీస్‌లలో నటిస్తోంది. ఇప్పటికే NBK109 చిత్రం షూటింగ్ దాదాపు పూర్తిఅయింది. అఖండ 2 రెండు రోజుల క్రితం పూజా కార్యక్రమాలు జరిగాయి. తెలుగులో ఆఫర్స్ కోసం ఎదురుచూస్తున్న ఈబ్యూటీకి లక్ కలిసివచ్చింది. బాలకృష్ణ చిత్రాల్లో వరుసగా ఛాన్స్ కొట్టేసింది.తెలుగు ప్రేక్షకులకు ఆమె ప్రధానంగా పరిచయం అయింది 2015లో విడుదలైన "కంచె" సినిమా ద్వారా. ఈ సినిమాలో ప్రగ్యా జైస్వాల్ సీతాదేవి పాత్రలో నటించి, విమర్శకుల ప్రశంసలు అందుకుంది.ముఖ్యంగా, 2021లో విడుదలైన "అఖండ" సినిమాలో బాలకృష్ణ సరసన ఆమె నటన ప్రేక్షకులను, అభిమానులను బాగా ఆకట్టుకుంది. ఈ సినిమా భారీ విజయాన్ని సాధించి, ప్రగ్యా కెరీర్‌లో మరో మైలురాయిగా నిలిచింది.ఈ బ్యూటీ సోషల్ మీడియాలోనూ ఫుల్ యాక్టివ్‌గా ఉంటూ తెగ సందడి చేస్తుంది.

సూర్య www.suryaa.com EVENING EDITION 4PM

# ఏ ప్రగతి జరగాలన్నా పోలీసులే కీలకం


## సీఎం చంద్రబాబు




విధి నిర్వహణలో చాలా మంది పోలీసులు ప్రాణాలు విడిచి ప్రజల హృదయాల్లో త్యాగధనులుగా నిలిచారని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. అన్నింటికంటే పోలీసు శాఖ అత్యంత కీలకమని చెప్పారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. "ఏ ప్రగతి జరగాలన్నా పోలీసులే కీలకం. ప్రజల ప్రాణాలు, ఆస్తులు కాపాడేందుకు రాత్రింబవళ్లు కష్టపడుతున్నారు. అహర్నిశలు శ్రమిస్తున్న పోలీసులను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా. ఉమ్మడి రాష్ట్రంలో నక్సలిజాన్ని ఉక్కుపాదంతో అణచివేశారు. ఫ్యాక్షనిజం, రౌడీల ఆట కట్టించారు. శాంతిభద్రతలను కాపాడటంలో ఏమాత్రం రాజీలేదు. పోలీసుల సంక్షేమం మా ప్రభుత్వం బాధ్యత. పటిష్ఠ యంత్రాంగంగా తయారు చేయడం మా కర్తవ్యం. రాష్ట్ర విభజన తర్వాత పోలీసు వ్యవస్థలో అనేక మార్పులు తీసుకొచ్చాం. వాహనాలతో పాటు పరికరాలు, సాంకేతిక సౌకర్యం కల్పించాం. ఏపీ పోలీసు అంటే దేశంలోనే మోడల్‌గా తీర్చిదిద్దాలని ముందుకెళ్లాం. 2014-2019 మధ్య రూ.600 కోట్లు ఖర్చు చేశాం. కొత్తగా వాహనాల కోసం రూ.150కోట్లు వెచ్చించాం. పోలీసు కార్యాలయాల మరమ్మతులు, నిర్వహణకు రూ.60కోట్లు ఖర్చుపెట్టాం. రూ.27కోట్లతో ఏపీఎఫ్ఎస్ఎల్ ఎక్విప్‌మెంట్ కొనుగోలు చేశాం. పోలీసు సంక్షేమానికి రూ.55 కోట్లు కేటాయించాం.

సర్వే రాళ్లపై బొమ్మలకు తగలేసి.. సీసీ కెమెరాలకు రూ.700కోట్లు ఇవ్వలేకపోయారు..

సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు దీటైన పోలీసు వ్యవస్థకు శ్రీకారం చుట్టాం. విశాఖపట్నంలో గ్రేహౌండ్స్ కోసం ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేశాం. కేంద్రం ఎప్పటికప్పుడు పోలీసు వ్యవస్థ ప్రక్షాళనకు ముందుకొస్తోంది. ఆధునిక ఆయుధాలు, సాంకేతిక పరిజ్ఞానం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. అధికారంలోకి వచ్చిన 125 రోజుల్లో పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నీ చెల్లించాం. దిశ పేరుతో వాహనాలకు రూ.16కోట్లు, కమ్యూనికేషన్ పరికరాల కోసం రూ.20కోట్లు పెండింగ్ పెడితే వాటినీ చెల్లించాం. తప్పు చేసిన వ్యక్తిని వెంటనే పట్టుకునే వ్యవస్థ అవసరం. గత ప్రభుత్వం కక్ష సాధింపులే పనిగా పెట్టుకుంది. రాగద్వేషాలకు అతీతంగా పనిచేసేదే పోలీసు వ్యవస్థ. సర్వే రాళ్లపై బొమ్మ కోసం రూ.700 కోట్లు తగలేసిన వ్యక్తి జగన్. సీసీ కెమెరాల కోసం మాత్రం రూ.700 కోట్లు ఇవ్వలేకపోయారు. నేరాల తీరు మారుతోంది.. పోలీసు వ్యవస్థ అప్రమత్తంగా ఉండాలి. రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడేవారిని కఠినంగా శిక్షించాలి" అని చంద్రబాబు సూచించారు.




## భారీ బందోబస్తు నడుమ.. నేటి నుంచి గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు

గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష కేంద్రాల్లో ప్రభుత్వం భారీ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నది. సోమవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. ఒక్కో కేంద్రంలో 20 మందికి పైగా పోలీసులు విధుల్లో ఉంటారు. జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలోనే ఈ పరీక్షలు జరుగుతాయి. హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ పోలీసు కమిషనర్లు, జిల్లా అదనపు కలెక్టర్లు సైతం తనిఖీలు నిర్వహిస్తారు. జీవో-29పై సోమవార ఉదయమే సుప్రీంకోర్టులో కేసు విచారణకు రానున్నది. సుప్రీంతీర్పు నేపథ్యంలో అంతటా ఉత్కంఠ నెలకొన్నది. మధ్యాహ్నం నుంచే గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు జరగనున్నాయి. మొత్తంగా 31,383 మంది అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లోనే పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు.



## రాష్ట్రం అభివృద్ధిలో పోలీసులు కీలకం: సీఎం రేవంత్

పోలీసుల సంక్షేమానికి ఏటా రూ. 20 కోట్లు కేటాయించామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. గోషామహల్‌లో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. అమరులైన పోలీసులకు సీఎం రేవంత్ రెడ్డి నివాళులు అర్పించారు. పోలీసులు నుంచి ఆయన గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. "డ్రగ్స్ నివారణపై ఫోకస్ పెట్టాం. గంజాయి, డ్రగ్స్ కట్టడికి టీజీ న్యాబ్ ఏర్పాటు చేశాం. 140 కోట్ల దేశ జనాభా ప్రశాంతంగా ఉంటున్నారంటే.. అందుకు పోలీసులే కారణం. రాష్ట్రం అభివృద్ధి పదం వైపు నడవాలంటే పోలీసులు కీలకం. నిరుద్యోగుల సమస్య, శాంతి భద్రత లేని రాష్ట్రం ఉంటే పెట్టుబడులు రావు. రాష్ట్రం అభివృద్ధికి పోలిసుల నిరంతరం శ్రమిస్తున్నందుకు పోలీసులు అభినందనలు. అమరులైన పోలీస్ అధికారుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుంది. తీవ్రవాదులు మావోయిస్టుల చేతిలో మరణించిన అధికారులను స్మరించుకోవటం అందరికి స్ఫూర్తిదాయకం. సైబర్ నేరాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. డ్రగ్స్ మహమ్మారి యువతపై తీవ్ర ప్రభావం చూపుతోంది. పంజాబ్ రాష్టంలో డగ్స్ వినియోగం పెరిగిపోయింది. తెలంగాణ రాష్టంలో డగ్స్‌ను పూర్తిగా కంట్రోల్ చేసేందుకు టీజీఎన్‌ఏబీను ఏర్పాటు చేశాం. దేశానికే తెలంగాణ రాష్టం ఆదర్శంగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్యలు పరిష్కారం కోసం కృషి చేస్తున్నాం. మందిరాల మీద, మజీద్‌ల మీద దాడులు చేసే వారిపై కఠినంగా వ్యవహారిస్తాం. ఇటీవల ముత్యాలమ్మ గుడిపై దాడి చేసిన వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటాం. శాంతి భద్రతలు తమ చేతిల్లోకి తీసుకునే వారి పట్ల కఠినంగా ఉండాలి.




## 'కేజీఎఫ్' స్టైల్లోనే 'బఘీర' ట్రైలర్ రిలీజ్

'కేజీఎఫ్', 'సలార్' సినిమాలతో తెలుగులోనూ బోలెడంత క్రేజ్ సంపాదించుకున్న కన్నడ దర్శకుడు ప్రశాంత్ నీల్. ప్రస్తుతం ఎన్టీఆర్ కొత్త మూవీ కోసం రెడీ అవుతున్నాడు. డైరెక్టర్‌గా ఫుల్ ఫామ్‌లో నీల్.. 'బఘీర' అనే సినిమాకు స్టోరీ అందించాడు. తాజాగా ఆ చిత్ర తెలుగు ట్రైలర్‌ని రిలీజ్ చేశారు. శ్రీమురళి, రుక్మిణి వసంత్ హీరోహీరోయిన్లుగా నటించిన 'బఘీర' సినిమాను.. 'కేజీఎఫ్', 'సలార్' నిర్మించిన హోంబల్ ఫిల్మ్స్ భారీ బడ్జెట్‌తో నిర్మించింది. డాక్టర్. సూరి దర్శకుడు. ట్రైలర్ చూస్తుంటే మంచి యాక్షన్ ఫీస్ట్‌లా అనిపించింది. అమ్మ సెంటిమెంట్, ముసుగు వేసుకుని విలన్లని చంపడం లాంటివి 'కేజీఎఫ్' చిత్రాన్ని గుర్తుచేస్తున్నాయి.ట్రైలర్ బట్టి చూస్తే.. చిన్నప్పుడు తల్లి చనిపోయిన ఓ పిల్లాడు.. పెద్దయ్యాక పోలీస్ అవుతాడు. న్యాయం జరగట్లేదని, ముసుగు వేసుకుని 'బఘీర' గెటప్‌లో విలన్లని చంపుతుంటాడు. చివరకు బఘీరాని పోలీసులు పట్టుకున్నారా లేదా అనేదే స్టోరీలా అనిపిస్తుంది. కన్నడతో పాటు తెలుగులోనూ దీపావళి సందర్భంగా అక్టోబర్ 31న థియేటర్లలో ఈ సినిమా రిలీజ్ కానుంది. ఇప్పటికే 'లక్కీ భాస్కర్', 'క' లాంటి తెలుగు స్ట్రెయిట్ మూవీస్, 'అమరన్' అనే డబ్బింగ్ సినిమాతో పాటు 'బఘీర' రిలీజ్ కానుంది.

## నాగర్‌కర్నూల్ జిల్లాలో పెద్దపులి సంచారం.. భయాందోళనలో ప్రజలు

నాగర్‌కర్నూల్ జిల్లాలో పెద్దపులి సంచారం స్థానికంగా కలకలం రేపుతున్నది. అమ్రాబాద్ మండలం తిర్మాలాపూర్ గ్రామంలో పెద్దపులి సంచరిస్తుండటంతో వాహనంలో వెళ్తున్న కొందరు ప్రయాణికులు తమ సెల్‌ఫోన్‌లో బంధించారు. ప్రయాణికులను చూసి పులి భయంతో చెట్లపొదల్లోకి వెళ్లినట్లు తెలిసింది. పులి సంచరించే వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కాగా, పెద్దపులి ఎప్పుడు ఎవరిపై దాడి చేస్తుందేమోనని పరిసర ప్రాంతాల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. ఫారెస్ట్ అధికారులు వెంటనే స్పందించి పులిని బంధించాలని స్థానికులు కోరుతున్నారు.






## న్యూజిలాండ్ ఘన విజయం

మహిళల టీ20 క్రికెట్‌లో న్యూజిలాండ్ ప్రపంచ ఛాంపియన్‌గా అవతరించింది. సోఫీ డివైన్ సారథ్యంలోని న్యూజిలాండ్ తొలిసారి ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. అక్టోబర్ 20 ఆదివారం దుబాయ్‌లో జరిగిన ఫైనల్లో న్యూజిలాండ్ 32 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాను ఓడించి ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. దీంతో వారి 15 ఏళ్ల నిరీక్షణ కూడా ముగిసింది. అలాగే టీ20 లేదా వన్డేల్లో ప్రపంచకప్ గెలిచిన తొలి జట్టుగా న్యూజిలాండ్ నిలిచింది. దీనికి ముందు సీనియర్ పురుషుల లేదా మహిళల క్రికెట్‌లో న్యూజిలాండ్ జట్టు ఏ ప్రపంచకప్‌ను గెలుచుకోలేదు. వరుసగా రెండో ఏడాది ప్రపంచకప్ ఫైనల్‌లో దక్షిణాఫ్రికా గుండె బద్దలైపోయింది. అక్టోబరు 20 ఆదివారం న్యూజిలాండ్ క్రికెట్‌కు అత్యంత ఉత్సాహంగా ప్రారంభమైంది. దాదాపు 36 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత తొలిసారిగా న్యూజిలాండ్ పురుషుల జట్టు భారత్‌లో టెస్టు మ్యాచ్‌లో విజయం సాధించింది. బెంగళూరు టెస్టులో టామ్ లాథమ్ జట్టు భారత్‌పై 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. దీని తర్వాత దుబాయ్‌లో కివీ మహిళల జట్టు ప్రపంచ కప్ టైటిల్ కోసం తమ దేశం సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. అదే సమయంలో దక్షిణాఫ్రికా క్రికెట్ 4 నెలల వ్యవధిలో రెండోసారి ఫైనల్‌లో దారుణ ఓటమిని ఎదుర్కోవలసి వచ్చింది. అంతకుముందు జూన్‌లో పురుషుల టీ20 ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికా ఫైనల్‌లో టీమిండియా చేతిలో ఓడిపోయింది. ఏదీ ఏమైనా ఫైనల్‌లో దక్షిణాఫ్రికాపై 32 పరుగుల తేడాతో గెలిచి ఛాంపియన్‌గా నిలిచింది. కివీస్ టీ20 ప్రపంచకప్‌ను సాధించడం ఇదే తొలిసారి. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 158 పరుగులు చేసింది. ఇందులో దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 126 పరుగులు చేసింది. టాస్ ఓడిపోయిన న్యూజిలాండ్ జట్టు ముందుగా బ్యాటింగ్ చేసి 158 పరుగులు చేసింది. రెండో ఓవర్‌లోనే తొలి వికెట్ పడిపోవడంతో సుజీ బేట్స్, అమేలియా కర్‌లు ఇన్నింగ్స్‌ను చేజిక్కించుకున్నారు.

కెర్ ఆల్‌రౌండ్ షో:

అంచనాలు లేకుండా బరిలోకి దిగి న్యూజిలాండ్ అద్భుతం చేసింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన కివీస్..సమిష్టి ప్రదర్శనతో ఆకట్టుకుంది. 16 పరుగులకే జార్జియా(9) వికెట్ కోల్పోయిన కివీస్..బేట్స్, కెర్ బ్యాటింగ్‌తో గాడిలో పడింది. వీరిద్దరు సఫారీ బౌలింగ్ దాడిని సమర్థంగా నిలువరిస్తూ పరుగులు కొల్లగొట్టారు. రెండో వికెట్‌కు వీరిద్దరు కలిసి 37 పరుగులు జోడించారు. కెప్టెన్ డివైన్(6) నిరాశపరిచినా..బ్రూక్‌తో కలిసి కెర్ ఇన్నింగ్స్‌ను మళ్లీ చక్కదిద్దింది. సమయోచిత ఆటతీరుతో స్కోరుబోర్డుకు కీలక పరుగులు జతచేసింది. 14 పరుగుల తేడాతో వీరద్దరు ఔటైనా కివీస్ పోరాడే స్కోరు అందుకుంది.

సంక్షిప్త స్కోర్లు

న్యూజిలాండ్: 20 ఓవర్లలో 158/5(కెర్ 43, బ్రూక్ 38, మాల్బా 2/31, డిక్లెర్క్ 1/17), దక్షిణాఫ్రికా: 20 ఓవర్లలో 126/9(వోల్వార్డ్ 33, బ్రిట్స్ 17, కెర్ 3/24, రోసిమెరీ 3/25).



## రైతుల ద్రోహి కాంగ్రెస్ పార్టీ

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

రైతుల ద్రోహి కాంగ్రెస్ పార్టీ అంటూ సీరియస్ కామెంట్స్ చేశారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. రైతుబంధు ఎగిరపోయింది.. రాబందుల రెక్కల చప్పుడే మిగిలింది అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ ట్విట్టర్ వేదికగా..'రైతుబంధు కావాలా..? రాబందు కావాలా?. ఎన్నికల ముందు బీఆర్ఎస్ ఇచ్చిన నినాదం గుర్తుందా?. రైతుబంధు ఎగిరిపోయింది.. రాబందుల రెక్కల చప్పుడే మిగిలింది!. నమ్మి నానబోస్తే పుచ్చి బుర్రలైనట్టుంది పరిస్థితి... ఎకరానికి 15వేలు ఇస్తామని ఊదరగొట్టి.. ఉన్న పదివేలు ఊడగొట్టారు!. పంట పెట్టుబడి ఎగ్గొట్టడం అంటే.. అన్నదాత వెన్ను విరవడమే..!. రైతు ద్రోహి కాంగ్రెస్.. చరిత్ర నిండా అనేక రుజువులు.. ఇప్పుడు ఇంకొకటి!' అంటూ ఘాటు విమర్శలు చేశారు.

## అందాల రాశీ

ఊహలు గుసగుసలాడే మూవీతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చి కుర్రకారు గుండెల్లో పదిలమైన స్థానం ఏర్పర్చుకుంది హీరోయిన్ రాశి ఖన్నా. కెమెరా ముందు తన టాలెంట్ బయట పెడుతూనే సిల్వర్ స్క్రీన్ పై అందాలు వడ్డించి సక్సెస్‌ఫుల్ హీరోయిన్ అయింది ఈ ఢిల్లీ భామ.సినిమాల పరంగా దూకుడుగా వెళ్లకుండా ఆచితూచి అడుగులేస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించింది. ప్రాధాన్యత ఉన్న రోల్స్ ఎంచుకుంటూ క్రమంగా బిజీ హీరోయిన్ గా మారిపోయింది. అందివచ్చిన ప్రతి అవకాశాన్ని సరిగ్గా వాడుకుంటోంది.క్రమంగా తన లుక్ పూర్తిగా మార్చేసి ఆశ్చర్యపరుస్తోంది ఈ యంగ్ లేడీ. రెగ్యులర్ వర్కవుట్స్ చేస్తూ తన శరీర సౌష్టవాన్ని మార్చుకున్న రాశీ.. ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో సెగలు పుట్టిస్తోంది. ఫ్యాన్స్ తో టచ్ లోకి వస్తూ రెగ్యులర్ అప్‌డేట్స్ ఇస్తోంది.ఈ క్రమంలోనే తాజాగా రాశీ ఖన్నా షేర్ చేసిన కొన్ని పిక్స్ వైరల్ అవుతున్నాయి. ఎద అందాల గేట్లు మొత్తం ఎత్తేసి రచ్చ చేసింది ఈ బ్యూటీ. కెమెరా ముందు గ్లామర్ ఒలకబోసింది. దీంతో ఈ ఫొటోస్ నెట్టింట వైరల్ అవుతున్నాయి.

